

కథ

"ప్రియమైన మీకు!

మిమ్మల్ని తొలిసారి కాలేజ్ క్యాంపస్‌లో చూశాను. క్రికెట్ లీగ్ మ్యాచ్ కోసం బ్యాట్ చేతపట్టుకొని మీరు గ్రౌండ్‌లోకి వస్తోంటే అచ్చం సచిన్‌లా కనిపించారంటే నమ్మండి!

మిమ్మల్ని చూస్తుంటే ఎన్నో వసంతాల నుండి పరిచయం వున్న వ్యక్తిలా, ఆత్మీయుడిలా అగుపిస్తారు. అప్పట్నుంచి మీతో స్నేహం పెంచుకోవాలన్న ఆరాటం మొదలైంది.

# మన్నించుమా ప్రియా!

## సాహిత్య ప్రకాశ్

ఆ రోజు నాకింకా బాగా గుర్తుంది. కాలేజీ వార్షికోత్సవం రోజున మీరు పాడిన ప్రేమ గీతం నా హృదయాంతరాలలో ఇంకా మెదులుతూనే వుంది.

డియర్ రాజా! ఎందుకో ఈ మధ్య నేను చేసిన ప్రతి పనీ మీకే చెప్పాలనిపిస్తోంది. ఇది మనిషి సాధారణ స్థాయి నుండి ప్రేమ స్థాయికి వెళ్లినప్పుడు మాత్రమే జరిగే పరిణామం.

ప్రస్తుతం నా ఉచ్ఛ్వాస నిశ్వాసాల్లో మీ గురించిన ఆలోచనలే! కలలో సైతం మీ ఊసుల్నే నెమరువేసుకుంటున్నాను. నా క్కావలసిన ప్రపంచాన్ని మీ కళ్లలోనే వెతుక్కోవాలనుకుంటున్నాను. మీతో మాట్లాడాలని ప్రతి రోజు ఖచ్చితంగా నిర్ణయించుకుంటాను. కానీ అదేం చిత్రమో మిమ్మల్ని చూడాలంటేనే భయం. అందుకే దూరం నుంచే చూపుల్తో సరిపెట్టుకుని తృప్తిపడుతున్నాను.

మొదట చూపులోనే మిమ్మల్ని ప్రేమించి ఒక వసంత కాలంగా ఎదురు చూస్తున్నా. ప్రేమాన్వేషణ పదరూపమే ఈ లేఖ... ప్రేమ లేఖ... మీ జవాబుకై ఎదురు చూస్తూ...

మీ

భావన...

లెటర్‌ని ఆసాంతం చదివిన రాజా ఓ అలౌకికానంద స్థితిలోకి వెళ్లిపోయాడు. అతడి కళ్ల ముందు భావన రూపం మెదిలింది. ఈజీ ఛెయిర్‌లో వెనక్కి వాలి సీలింగ్ వైపు చూస్తున్నాడు. దూరంగా వేణుగోపాలస్వామి ఆలయంలోంచి 'గీత' వినిపిస్తోంది.

"జాతస్య హి ధ్రువో మృత్యుర్ధ్రువం జన్మ మృతస్యచ...."

ఎంత కాంట్రాస్ట్ కదూ...! జీవం పోసే భావుకత నిండిన ప్రేమలేఖ చదువుతూ...మృత్యువు గురించిన వైరాగ్యపు వచనాలు వినడం...! గదిలో ఓ మూల సాలీడు ఒక దారంతో మరో దారం కలుపుకుంటూ అందమైన గూడు అల్లుకుంటోంది. ఎంత ఓర్పుగా, నేర్పుగా అతి కష్టపడుతోంటే జీవించడం కోసం అది పడుతోన్న తపన అర్థమవుతోంది. ఒక మలుపుని మరో మలుపుతో కలుపుకుంటూ పోతేనే జీవితం.

కానీ... కానీ...

మొదటి మలుపే చివరి మలుపైతే...?!
అదే ఈ కథ..!

***

కుర్చీలో కూర్చుని దీర్ఘంగా ఆలోచిస్తోన్న రాజాకి వెనకు వైపు నుంచి వచ్చి గట్టిగా కళ్లు మూశాడు కిరణ్.

''ఎవరో చెప్పుకో చూద్దాం...!''

''అబ్బా...! వదల్రా కిరణ్...!'' చేతుల్ని విడదీసే ప్రయత్నంలో అన్నాడు రాజా.

ఇటు రాజా ముందుకు వచ్చి అతని చేతిలో ఓ గిఫ్ట్ ప్యాక్ పెట్టాడు కిరణ్.

ఏంటన్నట్లు కళ్లతోనే ప్రశ్నించాడు రాజా.

''కొత్త డ్రెస్...! పండక్కి నువ్వు డ్రెస్ తీసుకోలేదు కదా!'' చెప్పాడు కిరణ్.

''వద్దురా...నీ స్కాలర్ షిప్ డబ్బుని అనవసరంగా ఎందుకు వేస్ట్ చేశావ్!''

''ఇది స్కాలర్ షిప్ డబ్బు కాదులేరా... నాన్న మనియార్డరు చేశాడు...''

''అయినా ఈ గిఫ్టులు నాకెందుకురా! కాలేజీ ఫీజులు కట్టావు. పచారీ ఖర్చులు ఇచ్చావు..సిగరెట్లు కూడా...''

''ఛ... అవేం మాటలురా... నాకంటూ ఎవరున్నారుచెప్పు...'' అంటూ రాజాని ఆలింగనం చేసుకున్నాడు కిరణ్.

అతని అభిమానానికి కదిలిపోయాడు రాజా.

''నా రాక... ఈ గిఫ్ట్... ఇవన్నీ నీకు సర్ప్రైజ్ కదూ...''

''అవును...''

''అయితే అంతకన్నా ఓ సర్ప్రైజ్ ఇప్పుడు నీకు చెప్పబోతున్నాను. అయితే దీనికి పరిష్కారం చూపించే బాధ్యత మాత్రం నీదే...''

''ఏంటది?'' ప్రశ్నార్థకంగా చూశాడు రాజా.

''నేను..నేను...భావనని ప్రేమిస్తున్నాను. తను నాకు కావాలి. తను లేకపోతే నేను చచ్చిపోతాను. నా ప్రేమని భావనకి ఎలా చెప్పాలో తెలీడం లేదు. ఈ విషయంలో నీ సహకారం కావాలి...'' అంటూ తన ధోరణిలో తను చెప్పుకుపోతున్నాడు కిరణ్.

రాజా అలాగే చూస్తుండిపోయాడు. అతని చూపులో నిశ్చలత వుందా లేదా అనే మీమాంసలో భుజం పట్టుకుని ఓ కుదుపు కుదిపాడు కిరణ్.

ఉలిక్కిపడ్డాడు రాజా.

''ఏంట్రా నువ్వేదో సలహా ఇస్తావనుకుంటే...!'' నిరాశగా అన్నాడు కిరణ్.

కిరణ్ తన కోసం చేసిన పనులు, సహాయం అన్నీ రాజాకి గుర్తుకొచ్చాయి.

''కిరణ్! నాకోసం నువ్వు ఎంతో చేశావ్... ఎన్నో చేసావ్...అన్నీ చేసిన నీకోసం... ఏమీ చేయలేని నేను....!! కానీ....

నా హృదయం ఒ....ప్పు....కుం.....టుం...దా?! ఏమో..?! పేలవంగా నవ్వి మనసులో అనుకున్నాడు. జీవితాన్ని ప్రేమించే నేను ప్రేమకు పనికి రాను! ప్రేమ విఫలమైతే నువ్వు జీవించవు!! ఈ కాస్త సహాయం చేయకపోతే ఎలా మిత్రమా! నిన్నూ... భావనని కలిపే పూచీ నాది.

***

ఆస్పత్రిలోని ఆ గది చాలా నిశ్శబ్దంగా వుంది. ఆక్సిజన్ సిలిండర్ పైప్ లోంచి గాలి రాజా ఊపిరితిత్తుల్లోంచి నిశ్శబ్దంగా పయనిస్తోంది. అతని బెడ్ కి కాస్త దూరంలో ఒక నర్సు ఏదో నవల తిరగేస్తోంది. ఇంతలో రాజాకి వెక్కిళ్లు మొదలయ్యాయి. నర్సు అనుమానంగా తలెత్తి చూసింది. రాజా గుండె ఎగిసి పడుతోంది.

నర్సు ఒక్క ఉదుటన లేచి రాజా దగ్గరకి వెళ్లి ఛాతిని చేత్తో రాయడం ప్రారంభించింది. అయినా వెక్కిళ్లు తగ్గలేదు. పరిగెత్తుకుంటూ వెళ్లి డాక్టర్ని తీసుకొచ్చింది. వెక్కిళ్లు లేవు...

''సారీ... హి ఈజ్ డెడ్...!''

***

''రాజా!''

గట్టిగా అరిచి పిచ్చిపట్టినట్టుగా పరిగెత్తడం మొదలుపెట్టాడు కిరణ్. కాలేజీలో అతని ప్రవర్తన ఎవరికీ




అర్థం కాలేదు. ఆటో గుద్దుకొని విసురుగా కిందపడినా... కాలికి దెబ్బ తగిలి బొటనవేలు నుంచి రక్తం వచ్చినా ఏమీ పట్టించుకోకుండా పరిగెత్తుకుంటూ ఆస్పత్రికి వచ్చాడు. రిసెప్షన్లో రాజా వుండే వార్డుని అడిగి తెలుసుకున్నాడు.

''డాక్టర్... వాట్ హ్యాప్పెండ్ టు మై రాజా...!'' ఏడుస్తూ గట్టిగా అడిగాడు కిరణ్.

అప్పుడే బెడ్ పై రాజా మొహంపై దుప్పటి కప్పుతూ నర్స్ కనిపించింది.

''డాక్టర్...!'' మరింత గట్టిగా అరిచాడు కిరణ్.

''సారీ కిరణ్... హి ఈజ్ నో మోర్!''

ఆ మాట విని కాళ్ల కింద భూమి కంపించడంతో తూలి కింద పడబోయాడు కిరణ్. అయితే ఆసరాగా గోడపట్టుకుని నిలబడ్డాడు. ఇంతలో విషయం తెలుసుకుని కాలేజ్ అంతా అక్కడికి కదలివచ్చింది. భావన కూడా స్థాణువులా నిలబడి చూస్తోంది.

''డాక్టర్...! ఇంతకీ రాజా ఏమైంది?!'' అడిగింది ఆ అమ్మాయి.

''రాజా...చాలా కాలంగా ఎన్నటికీ నయం కాని 'లోయ్ గెహ్రిగ్' అనే జబ్బుతో బాధపడేవాడు. ఈ జబ్బు వచ్చిన వారికి వెన్నెముకలో రక్త కణాలు క్షీణించిపోతాయి. మెదడులో కండరాలను కంట్రోల్ చేసే భాగం దెబ్బతింటుంది. క్రమంగా దుర్భరమైన జీవితం గడపాల్సి వస్తుంది. అతని జబ్బు తీవ్ర స్థాయికి వెళ్లకముందే కన్నుమూశాడు...'' వివరంగా చెప్పాడు డాక్టర్.

అందరూ కన్నీళ్ల పర్యంతమయ్యారు.

''ఇంకొంత కాలం రాజా బతికుండేవాడే...కానీ దేని గురించో తీవ్రంగా ఆలోచించి టెన్షన్ పడడంతో మెదడులోని నరాలు చిట్లి... అని చెప్పడం ఆపి...

మీలో భావన ఎవరు?! రాజా చనిపోయేముందు ఈ లెటర్ని భావనకి ఇవ్వమని చెప్పాడు...'' అన్నాడు డాక్టర్.

అందరూ భావన వైపు చూశారు. వాళ్ల చూపును బట్టి భావనని పోల్చుకున్న డాక్టర్ ఉత్తరాన్ని ఆమె చేతికి అందించాడు. వణుకుతోన్న చేతుల్తో అందుకుంది భావన.

***

*డియర్ భావనా!*

ఈ ఉత్తరం నీకు అందేనాటికి, బహుశా నేనీ లోకంలో వుండకపోవచ్చు. అయితేనేం. అక్కడ నాలోకంలో నీ జ్ఞాపకం వుంటుంది. అందుకే ధైర్యంగా వెళ్లిపోతున్నాను. నీ ప్రేమలేఖ చదివాను. అందుకే ఈ ఉత్తరం...! నీ 'ప్రేమ'ని అందుకోలేని నేను నీకు 'లేఖ'ని మాత్రమేరాయగలుగుతున్నాను. 'ప్రేమలేఖ' రాయలేని అశక్తుడ్ని.

నువ్వు నన్ను అభిమానించావ్... అందుకోవాలనుకున్నావ్...

కానీ ఈ అల్పాయుష్కుడికి ఆ అదృష్టం లేదు. అది చెప్పలేక నాలో నేనే నలిగిపోతున్నాను.

కాలం కాలనాగై సమీపించిందని, చివరి చీకటి దుప్పటిని కప్పడానికి మృత్యువు పొంచి వుందని నాకు తెలుస్తూనే వుంది.

అందుకే నేను పోయేలోగా...

ఒక చిన్న పని చేసి... ఒక మనిషిని బతికించి...

ఒక ప్రేమికుడికి అమృతం లాంటి నీ ప్రేమను... నా ద్వారా నేనే అందించి నా బతుకు రంగస్థలం మీద చివరిగీతం పాడాలనుకుంటున్నాను.

ఇన్నాళ్లు విధి వేదికపైన నా జీవితం పేలవమైన నాటకంగానే సాగింది. ముగింపు కూడా అసంతృప్తి తోనే ముగియబోతోంది.

అది సంపూర్ణం కావాలంటే సంతృప్తి కావాలి...

సంతృప్తి దొరకాలంటే నువ్వొక పనిచేయాలి.

అదీ... నువ్వు కిరణ్ని పెళ్లి చేసుకోవడం...!

ఇలాంటి కోరిక కోరడం అసమంజసమో, అసహజమో నాకు తెలీదు. కానీ నా స్థానం మృత్యుశయ్య మాత్రమే అయినప్పుడు...పూల పల్లకీ ఎక్కాల్సిన కిరణ్... నా స్థానాన్ని ఆక్రమించుకోకూడదన్న స్వార్థం ఇది. నువ్వు దూరమైతే కిరణ్ బతకలేడు. వాడు మంచివాడు. మనసున్న ప్రేమికుడు.

నీ కోసమే పుట్టినవాడు...

నేను...?!!?

నేను మరణం కోసం మాత్రమే పుట్టిన మృతజీవిని. నన్ను అమరజీవిగా మార్చగలిగే శక్తి... నీ చేతుల్లోనే వుంది.

నీకేమీ కాలేని
'రాజా'...!

భావన కన్నీటి సంద్రమైంది...

★